ప్రజాశక్తి
సోమవారం 24 ఫిబ్రవరి, 2025
5
శ్రీకాకుళం

శివరాత్రికి ఆర్‌టిసి ప్రత్యేక బస్‌లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శివరాత్రి సందర్భంగా జిల్లాలోని ఆర్‌టిసి డిపోల నుంచి వివిధ శైవ క్షేత్రాలకు 60 ప్రత్యేక బస్‌లు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రణస్థలం నుంచి రామతీర్థాలకు 30, టెక్కలి నుంచి రావివలసకు 12, పలాస నుంచి సాబకోటకు 12, శ్రీముఖలింగానికి 6 ప్రత్యేక బస్‌లను నడుపుతున్నట్లు తెలిపారు. సాధారణ టిక్కెట్ ధర చెల్లించి ప్రయాణికులు ఆర్‌టిసి బస్‌ల్లో ప్రయాణించాలన్నారు. అవసరమైతే ఈ ప్రాంతాలకు అదనపు బస్సులు నడుపుతామన్నారు. అలాగే ఈ నెల 24న శ్రీకాకుళం నుంచి శ్రీశైలంకు ప్రత్యేకంగా సూపర్ లగ్జరీ బస్ నడుపుతున్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ పొందాలని సూచించారు.

పోరాటాల్లో శివంగి కోరెడ్ల విజయగౌరి

- ఉపాధ్యాయ నేతగా ఎన్నో సమస్యలకు పరిష్కారం
- అక్రమ కేసులు, నిర్బంధాలు లెక్కచేయని వైనం
- మండలి బరిలోనూ అదే దూకుడు
- నిక్కచ్చిగా నిలదీసే పిడిఎఫ్ తరపున పోటీ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి / పార్వతీపురం

ఉపాధ్యాయ ఉద్యమాల్లో గర్జించే శివంగి... మహిళా ఉద్యోగుల పెన్నిధి... సమస్యల పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన మేధావి... పాలకపార్టీల కుతంత్రాలను నిర్భయంగా నిలదీసే నేత... బాలికల్లో అక్షరాస్యత పెంపొందించేందుకు పల్లెబాట పట్టిన వనిత. ఆమె ఎవరో కాదు. ఉత్తరాంధ్రా ఉపాధ్యాయ లోకానికి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేని కోరెడ్ల విజయగౌరి. ఉపాధ్యాయ ఉద్యమంలో టక్కున గుర్తుకు వచ్చేది ఈమె పేరే. బహుసా అందుకేనేమో శాసనమండలిలో రాజకీయాలతో సంబంధం లేకుండా ప్రభుత్వాలని నిక్కచ్చిగా నిలదీసే పిడిఎఫ్ (ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్) తరపున ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ నేపథ్యంలో ఆమె పోరాట పటిమ ఒకసారి పరిశీలిస్తే.., నిర్బంధాలు, కేసుల నడుమ ఆమె సాహస పోరాటాలు, విజయాలు ప్రస్ఫుటిస్తాయి.

సుమారు 33 ఏళ్ల క్రితం కోరెడ్ల విజయగౌరి ఉపాధ్యాయురాలిగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. నాటి నుంచి నేటి వరకు ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల కోసం పనిచేయడమే ఆమె చరిత్ర. ఆమె చేపట్టిన పోరాటాలు, విజయాలు, నిర్బంధాలు, అక్రమ కేసులు ఒకసారి పరిశీలిస్తే... రేషనలైజేషన్ పేరిట పాఠశాలల కుదింపు, క్లస్టర్ పాఠశాలల విధానం వంటి వాటిపై ఉద్యమాలు ముందుకు నడిపేందుకు విజయగౌరి చొరవ చూపారు. ఆ మేరకు ఉత్తరాంధ్ర జిల్లాలు, ముఖ్యంగా ఏజెన్సీల్లో పాఠశాలల మూసివేత తగ్గింది. పోరాటాల ఫలితంగా కొన్ని పాఠశాలల పునరుద్ధరణ కూడా జరిగాయి. జిఒ నెంబర్ 72కి వ్యతిరేకంగా చేపట్టిన పోరాటంలో పోలీసులు అక్రమ కేసు బనాయించినా వెరవలేదు. పేదలను విద్య నుంచి దూరం చేసే నూతన విద్యావిధానంపై జరిగిన పోరాటంలోనూ ఎంతో చురుకుగా పనిచేసి తనదైన ముద్ర వేశారు. ఈ క్రమంలో ప్రభుత్వ నిర్బంధాలు, బెదిరింపులు, కేసులు ఎదుర్కొన్నారు. గిరిజన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నడిపిన ఉద్యమంలో ముఖ్య భూమిక పోషించారు. ముఖ్యంగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న సిఆర్‌టిల రెన్యువల్, రెగ్యులరైజేషన్ వంటి వాటి కోసం విజయగౌరి పోరాటం.. ఉపాధ్యాయ ఉద్యమంలో మరిచిపోలేనిది. గిరిజన సంక్షేమ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అధికారాల తొలగింపునకు సంబంధించిన జిఒ 132 రద్దు కోసం అవిశ్రాంత పోరాటం చేశారు. ఐటిడిఎ కార్యాలయం ఎదుట నిర్వహించిన దీక్ష శిబిరంలో రాత్రి బస చేశారు. చివరకు ప్రభుత్వం దిగొచ్చి ఆ జిఒను రద్దు చేసింది. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్, రెగ్యులరైజేషన్ కోసం జరిగిన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. 2005లో 300 మంది ఉపాధ్యాయుల అక్రమ బదిలీల నిలుపుదల కోసం విజయగౌరి పోరాడారు. ఆ క్రమంలో అప్పటి సిఎం వైఎస్ రాజశేఖరరెడ్డి.. నేడు మన్యం జిల్లాలో భాగంగా ఉన్న జంఝావతి ప్రాజెక్టు రబ్బర్ డ్యామ్ ప్రారంభానికి వచ్చినప్పుడు పోలీసుల వలయం నుంచి తప్పించుకుని మరీ సభాస్థలి వద్దకు చేరుకుని ప్లకార్డుతో పెద్దపెట్టున నినాదాలు చేయడంతో అధికార యంత్రాంగం అవాక్కైంది. ఉలిక్కిపడ్డ అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ బయటకు పంపేందుకు పోలీసులను ఉసిగొల్పినప్పటికీ, నాటి సిఎం వైఎస్‌ఆర్ ఎంతో హుందాగా విజయగౌరిని వేదికపై రప్పించడంతో పాటు బదిలీలు రద్దు చేస్తున్నట్టుగా ప్రకటించారు. 2017లో అక్రమ బదిలీలపై జరిగిన ఉపాధ్యాయుల ఆందోళన కార్యక్రమంలో మహిళా ఉపాధ్యాయ నేతగా నాయకత్వం వహించారు. అప్పట్లో పెట్టిన అక్రమ కేసు ఏడేళ్లపాటు నడిచింది. 2017లోనే ఉపాధ్యాయుల వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేయాలని యుటిఎఫ్ తనదైన శైలిలో పోరాటం నడిపింది. చివరికి నాటి వెబ్ కౌన్సెలింగ్ రద్దు చేసి మాన్యువల్ కౌన్సిలింగ్‌ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ పోరాటంలో కీలకపాత్ర పోషించిన విజయగౌరిపై అప్పటి ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించింది. ఆ కేసును ఎదుర్కోవడానికి ఆమె కోర్టు చుట్టూ ఏడేళ్ల పాటు తిరిగారు. అయినా సరే, విజయగౌరి వెరవలేదు. మరింత మొక్కవోని దీక్షతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల్లో ఎక్కువమంది ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరుస్తూ స్వచ్ఛందంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. విజయానికి సానుకూల అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి.

బారులు తీరిన అభ్యర్థులు

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు

- మొదటి పేపరుకు 820, రెండో పేపరుకు 831మంది గైర్హాజరు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఎపిపిఎస్‌సి ఆధ్వర్యాన ఆదివారం జిల్లాలో నిర్వహించిన పరీక్షకు మొదటి పూట 820, రెండో పూట 831 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం, ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలల్లో నిర్వహించిన పరీక్షా కేంద్రాల్లో 5,535 మంది అభ్యర్థులు మెయిన్స్ పరీక్షకు హాజరు కావల్సి ఉండగా, వారిలో 4715 మంది మాత్రమే ఉదయం పరీక్షకు హాజరయ్యారు. అలాగే సాయంత్రం పరీక్షకు 4704 మంది హాజరయ్యారు. రెండో పూట పరీక్షకు 831 మంది గైర్హాజరయ్యారు. ఎచ్చెర్లలోని వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్‌పి కె.వి.మహేశ్వర్ రెడ్డి పరిశీలించారు. నగరంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆర్‌డిఒ సాయి ప్రత్యూష పర్యవేక్షించారు.

ఎచ్చెర్ల : గ్రూప్-2 మెయిన్స్ పరీక్షల కేంద్రాల వద్ద ఎస్‌పి కె.వి.మహేశ్వరరెడ్డి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా వెంకటేశ్వర ఇంజినీర్ కళాశాలకు వికలాంగుడు పరీక్షలు రాసేందుకు వచ్చారు. ఆయనను పరీక్ష కేంద్రం వద్దకు విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ సిబ్బంది సురక్షంగా చేరేందుకు సహాయ, సహకారాలు అందించారు. నిర్ణీత సమయానికి పరీక్ష గదిలోనికి హాజరయ్యేటట్టు సహకరించారు.

పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక

సమస్యల పరిష్కారానికి కృషి

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

సమావేశంలో మాట్లాడుతున్న విజయగౌరి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికుల, ప్రజాసమస్యల పరిష్కారానికే కృషి చేస్తానని అన్నారు. మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపించాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి పిలుపునిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో గత ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబరు 117ను కూటమి ప్రభుత్వం రద్దు చేస్తున్నట్టు ప్రకటించినా... రూపు మార్చి అదే విధానాన్ని అమలు చేస్తుందని అన్నారు. మరోవైపు ఉపాధ్యాయ, ఉద్యోగులకు పిఆర్‌సి గడువు ముగిసినా ఇంత వరకు 12వ పిఆర్‌సి చైర్మన్ నియమించలేదన్నారు. తక్షణమే చైర్మన్‌ని నియమించి పిఆర్‌సి ప్రకటించాలన్నారు. అప్పటి వరకు 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిలను చెల్లించాలని, దీనికోసం శాసనమండలిలో పోరాడుతానని స్పష్టం చేశారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తానన్నారు. కాంట్రాక్టు ఉపాధ్యాయ, అధ్యాపకులను రెగ్యులర్ చేయాలన్నారు. యూనివర్సిటీ, డిగ్రీ జూనియర్ కాలేజీల్లో తక్షణమే నియామకాలు చేపట్టాలని, జిఒ నంబరు 3ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ప్రయివేటు విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ, అధ్యాపకులకు, సిబ్బందికి వేతన చట్టం, హెల్త్ కార్డులు, ప్రత్యేక పెన్షన్ స్కీం, 200 గజాల ఇంటి స్థలం, సెలవులు, సంక్షేమ పథకాలు అమలు తదితర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, అదనపు పనులు అప్పగించడం వల్ల విద్యా బోధన సాగడం లేదని పేర్కొన్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థను యథావిధిగా కొనసాగించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ ఖాతాలను ప్రారంభించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. గిరిజన సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీల చట్టాన్ని రూపొందించాలన్నారు. పండిట్, పిఇటి పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్లు, ఎఎన్‌ఎంల పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్లస్ టు పాఠశాలలను కొనసాగించి రెగ్యులర్ అధ్యాపకులను నియమించాలన్నారు. కెజిబివి, పార్ట్ టైం, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ వెల్ఫేర్, ఎపి రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 62 ఏళ్ల ఉద్యోగ విరమణ వయసును వర్తింపచేయాలి. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిశోర్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, జన విజ్ఞాన వేదిక పూర్వ నాయకులు కొత్తకోట అప్పారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, పట్టణ నాయకులు ప్రకాష్ పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు పరిశీలనలో ఉద్రిక్తత

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జిని అడ్డుకున్న టిడిపి నాయకులు

చింతాడ రవితో వాగ్వాదం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బొడ్డేపల్లి వద్ద ఇసుక ర్యాంపు పరిశీలనకు వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ రావడంతో ఉద్రిక్తతలకు దారితీసింది. టిడిపి నాయకులు అక్రమంగా ఇసుక ర్యాంపును నిర్వహిస్తున్నారంటూ పరిశీలనకు వచ్చారు. దీంతో టిడిపి నాయకులు అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానంలో భాగంగా సింగూరు, బొడ్డేపల్లి, నెల్లిమెట్ట తదితర గ్రామాల్లో ఇసుక ర్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ ర్యాంపులను పరిశీలించేందుకు పొందూరు, ఆముదాలవలస మండలాల వైసిపి నాయకులతో కలిసి ఆదివారం ఉదయం బొడ్డేపల్లి ర్యాంపు సమీపానికి చింతాడ రవి చేరుకున్నారు. ర్యాంపుకు అరకిలో మీటరు దూరంలో ఇసుక ట్రాక్టర్ డ్రైవర్లతో పాటు బొడ్డేపల్లి, సింగూరు, నెలిమెట్ట గ్రామాలకు చెందిన టిడిపి నాయకులు చేరుకుని ర్యాంపుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరు పార్టీల నాయకుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పలువరు నాయకులు కల్పించుకుని గొడవ జరుగకుండా చూశారు. గత వైసిపి ప్రభుత్వంలో ట్రాక్టర్ ఇసుక మండల వాసులకు రూ.6 వేలుకు గాని లభించేదికాదని, ఇప్పుడు ట్రాక్టర్ ఇసుక ఉచిత ఇసుక విధానం వల్లే కేవలం రూ.1,500లకే లభిస్తుందని, దీనిని ఎందుకు రాజకీయం చేస్తున్నారని రవిని ప్రశ్నించారు. అక్రమంగా అధిక ధరలకు ఇసుకను విక్రయిస్తున్నట్టు ఎవరైనా ఫిర్యాదు చేశారా? అంటూ నిలదీశారు. ట్రాక్టర్ ఇసుకను రూ.6 వేలుకు గత ప్రభుత్వంలో దోచుకున్నప్పుడు మీరు ఎక్కడకుపోయారని ప్రశ్నించారు. దీంతో చేసేదిలేక మరలా వారం రోజుల్లో ఇసుక ర్యాంపు పరిశీలనకు వస్తానంటూ చింతాడ వెనుదిరిగారు. ఈ విషయంపై ఆముదాలవలస సిఐ సత్యనారాయణకు ఫిర్యాదు చేయడంతో హుటాహుటిన పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయకుండా ర్యాంపుకు ఎలా వస్తారని శాంతిభద్రతలకు విఘాతం కలిగి గొడవలు, కొట్లాటలు జరిగితే బాధ్యత ఎవరిదని చింతాడను సిఐ ప్రశ్నించారు. అనంతరం రవి మాట్లాడుతూ టెండర్లు పిలిచి ఇసుక ర్యాంపులను నిర్వహించాల్సి ఉండగా... అలా కాకుండా తమ టిడిపి నాయకులతో అక్రమంగా ఇసుక ర్యాంపులు నిర్వహిస్తూ కోట్లాది రూపాయలను ఎమ్మెల్యే కూన రవికుమార్ దోచుకుంటున్నారంటూ ఆరోపించారు. దీనిపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆశ్రయిస్తానని, లోకాయుక్తలో కేసు చేస్తామని పేర్కొన్నారు. ఈయన వెంట వైసిపి నాయకులు బొడ్డేపల్లి రమణ, చింతాడ సత్యప్రసాద్, గురుగుబిల్లి శేఖర్, పైడి నాగభూషణ్, తమ్మినేని రవి, పోలయ్య పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై శిక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మార్చి 1 నుంచి మొదలు కానున్న ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణలో అలసత్వం లేకుండా చూడాలని ఆర్‌డిఒ కె.సాయిప్రత్యూష సూచించారు. శ్రీకాకుళం మండలం సింగుపురం సమీపాన ఉన్న ఎస్ఆర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల నిర్వహణపై డిపార్ట్‌మెంట్ అధికారులకు, సూపరింటెండెంట్లకు, చీఫ్ సూపరింటెండెంట్లకు ఆదివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటర్మీడియట్ బోర్డు ఆదేశాలను అనుసరించి పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రశ్నాపత్రాల భద్రత, సెట్ పేపర్ల అమలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. సమావేశంలో ఆర్‌ఐఒ ప్రగడ దుర్గారావు, జిల్లా పరీక్ష నిర్వహణ కమిటీ సభ్యులు భీమేశ్వరరావు, పి.వి.ఎల్.నారాయణరావు, సింహాచలం, డిస్ట్రిక్ట్ బల్క్ అధికారి శ్యాంసుందర్, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ సాయిప్రత్యూష

సైన్స్ చదివేద్దాం ఇలా...

- ఈ అంశాలపై పట్టుంటే భౌతికశాస్త్రం సులువే
- 'పది' విద్యార్థులకు ప్రత్యేకం

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు బోధన కొనసాగిస్తుంటే అన్ని సబ్జెక్టుల్లో పట్టుసాధించి పదో తరగతిలో విజయం సాధించాలని విద్యార్థులు ఉత్సాహంతో ఉన్నారు. అయితే గణితం, సైన్స్‌పై కొంతమంది విద్యార్థులు అపోహలు కలిగి ఉంటారని వాస్తవానికి కొంతమేర దృష్టిసారిస్తే వాటిలోనూ మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పిరియా వేణుగోపాల్ తెలిపారు. ముఖ్యంగా విద్యార్థులతో మమేకమై వారిలో భయాన్ని తొలగించాలని, భౌతిక శాస్త్రంలో ఏ విధంగా చదివితే విద్యార్థులు సులువుగా మార్కులు సాధించగలరో ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. మార్చిలో పరీక్షలు రాయనున్న పదో తరగతి విద్యార్థులు ఈ కింది అంశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తే భౌతికశాస్త్రంలో సులువుగా విజయం సాధించవచ్చని తెలిపారు.

50 మార్కుల ప్రశ్నాపత్రంలో 24 మార్కులకు గాను, ఎనిమిది మార్కుల ప్రశ్నలు ప్రతి విద్యార్థీ సులువుగా జవాబులు రాయవచ్చని వివరించారు. వాటిలో రసాయన చర్యలు రకాలు, సమీకరణాలు తెలియచేయటం, హ్రస్వదృష్టి, దీర్ఘ దృష్టి, ఇంద్రధనస్సు ఏర్పడుట, ఓం నియమం, నిరోధాల శ్రేణి సంధానం, సమాంతర సంధానం, ఇనుము తుప్పు పట్టడం, సబ్బు సుభ్రపరిచే గుణం, అయిర్ స్టెడ్ ప్రయోగం, అయస్కాంత క్షేత్రంలో విద్యుత్ తీగపై పనిచేసే బలం వంటి అంశాలు విద్యార్థులు అవగాహన చేసుకోవాలని సూచించారు. అదే విధంగా 4 మార్కుల ప్రశ్నలు మూడింటిని కూడా సులువుగా అవగాహన చేసుకొనవచ్చని దీనిలో బొమ్మలు గీయడంలో భాగంగా లోహాలు, ఆమ్లాల లోహ చర్య, లోహ కార్బో నేట్లు ఆమ్లాల లోహ చర్య, ఆమ్లద్రావణంలో విద్యుత్ ప్రవహించుట, పుటాకార దర్పణంలో ప్రతిభింబాలు, కుంబాకార కటకంలో ప్రతిభింబాలు స్పష్టంగా గీయాలని అన్నారు. ఆమ్ల, క్షార సూచికల పట్టిక, పిహెచ్ విలువల పట్టిక, వక్రీభవనం - కాంతివేగం పట్టికలు సాధన చేస్తే ఫలితం ఉంటుందని చెప్పారు. వాషింగ్ సోడా, బేకింగ్ సోడా, బ్లీచింగ్ పౌడర్, ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ఉపయోగాలు విద్యార్థులు కచ్చితంగా అవగాహన చేసుకోవాలని అన్నారు.

ఇక రెండు మార్కుల ప్రశ్నల్లో భాగంగా ఆల్కేన్లు, ఆల్కీన్లు, ఆల్కైన్లు పట్టికలు, ప్రమేయ సమూహాల గురించి అవగాహన చేసుకుంటే భౌతిక శాస్త్రంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.



బోధిస్తున్న భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వేణుగోపాల్

'పది' పరీక్షల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

- 149 కేంద్రాల్లో పరీక్షలు
- డిఇఒ ఎస్.తిరుమల చైతన్య

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని డిఇఒ ఎస్.తిరుమల చైతన్య అన్నారు. మార్చి 17 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతాయని అన్నారు. ఈసారి ఎస్-ఎస్‌సి బోర్డు నిర్వహిస్తున్న పది పరీక్షలతో పాటు ఓపెన్ స్కూల్ పరీక్షలు ఏక కాలంలో జరుగుతున్నాయని వివరించారు. అందుకోసం పది పరీక్షలకు 149 కేంద్రాలు, ఓన్‌స్కూల్ పరీక్షలకు 8 కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. 65సి గ్రేడ్ సెంటర్లలో కస్టోడియన్ పర్యవేక్షణలో పేపర్లు ఉంటాయన్నారు. మిగిలిన చోట్ల పోలీసు స్టేషన్లలో, ట్రెజరీలో ఉన్న స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరచే వీలుందన్నారు. పరీక్షల నిర్వహణకు సమర్థవంతమైన ఏర్పాట్లు చేశామన్నారు. మరోవైపు విద్యార్థులకు తరగతుల నిర్వహణ ఇప్పటికే పూర్తి చేశామన్నారు. పునశ్చరణ తరగతులు సైతం పూర్తి చేశామని చెప్పారు. ఒత్తిడి లేకుండా విద్యార్థులను పరీక్షలకు సమాయత్తం చేశామన్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణ, మోడ్ ఆఫ్ ఎగ్జామినేషన్‌పై ముఖాముఖిలో భాగంగా 'ప్రజాశక్తి'కి వివరించారు.

? పరీక్షల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

జిల్లాలో పదో తరగతి పరీక్షలకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తిచేశాం. మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షలు జరగనున్నాయి. రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ఈ పరీక్షలు సాగుతాయి. మార్చి 4 నాటికి ఎస్‌ఎస్‌సి బోర్డు నుంచి పేపర్లు రానున్నాయి. వాటిని భద్రపరచడానికి పోలీస్‌స్టేసన్లతో పాటు ట్రెజరీ విభాగంలోని స్ట్రాంగ్ రూమ్‌లను సిద్ధం చేశాం. జిల్లాలో పోలీస్‌స్టేషన్, ట్రెజరీ అందుబాటులో లేని 65సి గ్రేడ్ కేంద్రాల పేపర్లు సమీప మండలాల్లోని పోలీస్‌స్టేషన్లలో భద్రపరచి పరీక్షల సమయంలో కారు కస్టోడియన్ సమక్షంలో వాటిని కేంద్రాలకు చేరుస్తాం. అందుకోసం ఇప్పటికే ఏర్పాట్లు దాదాపు పూర్తి చేశాం.

? ఈ ఏడాది ఎంత మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నారు?

జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పది పరీక్షలకు 28,938 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. వారిలో 28,273 మంది రెగ్యులర్ కాగా, 665 మంది విద్యార్థులు ప్రయివేటున పరీక్షలకు హాజరవుతున్నారు. జిల్లాలో పలు సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నాం.

? ప్రయివేటు స్కూళ్లలో ఫీజులు చెల్లించని కారణంతో హాల్ టిక్కెట్లకు ఇబ్బందులు ఉన్నాయా?

ఏదైనా స్కూల్ యాజమాన్యం పరీక్షల సమయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదు. ఎవరైనా హాల్ టిక్కెట్లు ఇవ్వకుంటే నేరుగా డిఇఒ కార్యాలయంలో ఫిర్యాదు చేసేందుకు వీలుంది. మొత్తం ఫీజు చెల్లిస్తేనే పదో తరగతి హాల్ టిక్కెట్ ఇస్తామని, లేకుంటే పరీక్ష రాయనివ్వ బోమంటూ ప్రయివేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అటువంటి సంఘటనలు ఎక్కడైనా ఉంటే డిఇఒ కార్యాలయానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులెవరైనా ఫిర్యాదు చేయవచ్చు. అలాగే పాఠశాల యాజమాన్యాలతో సంబంధం లేకుండా వెబ్సైట్ నుంచి, ప్రభుత్వ వాట్సాప్ నుంచి నేరుగా హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుంది.

? పరీక్షల నిర్వహణకు ఎంతమంది సిబ్బందిని నియమించారు?

జిల్లావ్యాప్తంగా 149 పరీక్షా కేంద్రాలకు గాను, 2400 మంది ఇన్విజిలేటర్లను నియమించాం. వారితో పాటు 149 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 149 మంది డిసిపిలు, 65 మంది కస్టోడియన్ అఅధికారులు, ప్రత్యేక స్క్వాడ్లను నియమించాం. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాలకు అనుగుణంగా డివిజన్ స్థాయిలో ఆర్‌డిఒలు డెప్యూటీ డిఇఒల పర్యవేక్షణ ఉంటుంది.

? ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు ఎటువంటి ఏర్పాట్లు చేశారు?

జిల్లాలో ఓపెన్ స్కూల్ పరీక్షలు మార్చి 3 నుంచి 15 వరకు జరుగుతాయి. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్షలు జరగనున్నాయి. ఈ పరీక్షలకు 807 మంది విద్యార్థులు, ఎనిమిది పరీక్షా కేంద్రాల్లో రాస్తారు. ఈ పరీక్షల పర్యవేక్షణకు 8 మంది సూపరింటెండెంట్లు, ఇద్దరు ఫ్లైయింగ్ స్క్వాడ్లను నియమించాం. ఓపెన్‌స్కూల్ ఇంటర్ పరీక్షలు కూడా మార్చి 3 నుంచి 15 వరకు జరుగుతాయి. 8 పరీక్షా కేంద్రాల్లో 1553 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరుకానున్నారు. పరీక్షల నిర్వహణకు పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

పిడిఎఫ్ అభ్యర్థికి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఉపాధ్యాయ సమస్యలపై పోరాడే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీ ఉద్యమ గొంతును గెలిపించాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు బొడ్డేపల్లి జనార్ధనరావు ఉపాధ్యాయ ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం మండలంలోని కణుగులవలసలో ఉపాధ్యాయుల ఇంటింటికి వెళ్లి పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరీకి తమ మొదటి ప్రాధాన్యత ఓటువేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల, పెన్షనర్ల సమస్యలపై నిత్యం పోరాటం చేసే పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని అత్యధిక ఓట్లతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చౌదరి రవీంద్ర, జిల్లా కార్యదర్శి టి.వి.టి.భాస్కరరావు, మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని పాపారావు, జిల్లా మాజీ కార్యదర్శి కింతలి చంద్రరావు పాల్గొన్నారు.

కోళ్లకు వ్యాక్సిన్ వేస్తున్న పురుషోత్తం

నాటుకోళ్లకి వ్యాక్సిన్

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

కవిటి: మండలంలోని సహలాలపుట్టుగలో 'మృత్యువాత పడుతున్న నాటుకోళ్లు' అంటూ శనివారం ప్రజాశక్తిలో ప్రచురితమైంది. దీనిపై పశు వైద్యాధికారులు స్పందించారు. ఆదివారం గ్రామానికి చేరుకున్న పశు వైద్య సిబ్బంది కోళ్లకి వ్యాక్సిన్ వేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం పశువైద్య సిబ్బంది పురుషోత్తం మాట్లాడుతూ పారుడు వ్యాధి, కునుకు వ్యాధితో పలువురి కోళ్లు చనిపోయాయని, కోళ్లకి మరి ఎటువంటి వ్యాధులు లేవని తెలిపారు.

రీజనల్ కో-ఆర్డినేటర్‌ను కలిసిన కృష్ణదాస్

కన్నబాబును కలిసిన కృష్ణదాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైసిపి ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా నియమితులైన కురసాల కన్నబాబును జిల్లా పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను ఆదివారం విశాఖలోని రీజనల్ కార్యాలయంలో కలుసుకుని పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆయనతో పాటు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, విజయనగరం జిల్లా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తం నాయుడిని సన్మానిస్తున్న పెన్షనర్లు

పెన్షనర్స్ జెఎసి చైర్మన్‌గా పురుషోత్తం నాయుడు

శ్రీకాకుళం ప్రతినిధి: పెన్షనర్స్ జెఎసి రాష్ట్ర చైర్మన్‌గా చౌదరి పురుషోత్తం నాయుడు ఎన్నికయ్యారు. విజయవాడలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. అదేవిధంగా సెక్రటరీ జనరల్ సతీష్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. రాష్ట్ర పెన్షనర్స్ జెఎసి చైర్మన్‌గా పురుషోత్తమ నాయుడు, సెక్రటరీ జనరల్‌గా సతీష్‌కుమార్ ఎన్నిక య్యారు. ఎన్‌జిఒ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి గతేడాది డిసెంబరు 31న ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. సుదీర్ఘ కాలం ఉద్యోగ సంఘ నాయకునిగా వివిధ హోదాల్లో పనిచేసిన పురుషోత్తం నాయుడు అనుభవం పెన్షనర్ల జెఎసికి అదనపు బలంగా ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు నాలుగు లక్షల మంది సభ్యులు గల పెన్షనర్స్ సంఘాల జెఎసి పెన్షనర్ల ప్రయోజనాలు హక్కుల కోసం పనిచేస్తుందని చెప్పారు. ప్రధానంగా ప్రధానంగా డిఎ బకాయిలు, హెల్త్ కార్డు సమస్యలపై పోరాటం చేయాలని సమావేశం తీర్మానం చేసింది. సమావేశానికి మాజీ ఎమ్మెల్సీ టి.డి.జనార్ధన్ పాల్గొని ప్రభుత్వం తరపున పెన్షనర్లకు రావలసిన ప్రయోజనాల కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చదరంగం ఆడుతున్న క్రీడాకారులు

సందడిగా చదరంగం పోటీలు

టెక్కలి : జిల్లాస్థాయి చదరంగం పోటీలు ఆదివారం స్థానిక ఓక్లాండ్ అంతర్జాతీయ పాఠశాలలో సమదడి వాతావరణం మధ్య సాగింది. జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఐదు రౌండ్లు పాటు నిర్వహించిన ఈ పోటీలో పలాసకు చెందిన కె.కల్పక్ ప్రథమస్థానం సాధించారు. శ్రీకాకుళానికి చెందిన బగాది కార్తికేయ ద్వితీయస్థానం, యశ్వంత్ తృతీయ స్థానం, బి.జీవన్ నాలుగో స్థానాన్ని సంపాదించుకున్నారని జిల్లా అసోసియేషన్ నాయకులు సనపల భీమారావు తెలిపారు. జూనియర్స్ విభాగంలో కె.లిపిక. సనపల రిత్విక్, కె.రాహుల్ మూడో స్థానాన్ని గెలుచుకున్నారు. విజేతలకు టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అందజేశారు. కార్యక్రమంలో బగాది కిషోర్‌కుమార్, జామి రమేష్, అభినవ్, చలపతి, లోకేష్, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా చేయాలి

లావేరు: విద్యార్థులకు ప్రస్తుత సమయం విలువైందని ప్రతిఒక్క విద్యార్థి రోజూ యోగా చేయాలని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో యోగా శిబిరం నిర్వహించారు. పరీక్షల సమయం దగ్గర పడడంతో వారు ఏకాగ్రతను పెంచుకోవడానికి వృక్షాసనం వేయించారు. అలాగే పద్మాసనం, వజ్రాసనం, తడాసనం, సూర్య నమస్కారంతో పాటు సుమారు 32 ఆసనాలు వేయించారు. రోజు యోగా చేయడం వలన శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటారన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలో చేతనకు ప్రథమ బహుమతి లభించింది. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, పాఠకులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు ఎర్రన్నాయుడు

అరసవల్లి : నివాళ్లర్పిస్తున్న కేంద్రమంత్రి, ఎమ్మెల్యే తదితరులు

కోటబొమ్మాళి : కేంద్ర మాజీ మంత్రి కింజరాపు ఎర్రనాయుడు ఉత్తరాంధ్ర నుంచి రాణించిన నేతల్లో అగ్రగణ్యులని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు కీర్తించారు. మండలంలోని నిమ్మాడలోని ఎర్రన్న ఘాటు వద్ద ఎర్రన్నాయుడు 68వ జయంతిని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, శ్రీకాకుళం, పాతపట్నం ఎమ్మెల్యేలు గొండు శంకర్, మామిడి గోవింద రావు, మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అరసవల్లి: ప్రపంచ వ్యాప్తంగా తెలుగువారి కీర్తి ప్రతిష్టలను తెలియజేసే మహోన్నత వ్యక్తి స్వర్గీయ కింజరాపు ఎర్రన్నాయుడని కేంద్ర పౌర విమానయాన శాఖామంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఎర్రన్నాయుడు 68వ జయంతి జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎర్రన్నాయుడు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ టిడిపిలో ఎనలేని సేవలు అందించారని, సీనియర్ టిడిపి నాయకునిగా పార్టీకి, ప్రజలకు మరువలేని నాయకత్వం అందించారని, ఆయన ఆశయాలు అందరికీ మార్గదర్శకమన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా అధ్యక్షులు కలమట వెంకటరమణ, టిడిపి కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: స్థానిక టిడిపి కార్యాలయంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి టిడిపి మండల అధ్యక్షులు అధ్యక్షులు సూరాడ మోహనరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ మాజీ సభ్యులు ఎన్. సూర్యనారాయణ, ఉపాధ్యక్షులు అరసవెల్లి ఉమా మహేశ్వరరావు, వంక రామారావు, పాపారావు పాల్గొన్నారు.

పలాస: టిడిపి కార్యాలయంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి నియోజకవర్గ సమన్వయకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి

కోటబొమ్మాళి : నివాళ్లర్పిస్తున్న మంత్రులు

పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎపిటిపిసి చైర్మన్ వజ్జ బాబూరావు, బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, సప్ప నవీన్, గాలి కృష్ణారావు, భావన దుర్యోధన, మోహనరావు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు బగాది శేషగిరి ఎర్రనాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి, మట్ట సుందరమ్మ, బెహరాకాళీ, మట్ట పురుషోత్తం, మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, ముడిదాన ఆనంద్‌కుమార్, కోరాడ రామప్రసాద్, రెయ్యి ప్రీతీష్‌చంద్ పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక టిడిపి కార్యాలయంలో ఎర్రన్నాయుడు చిత్రపటానికి టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్‌కుమార్ పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఎం.బాలకృష్ణ, పోలాకి చంద్రశేఖరరావు, తూలుకు మహేష్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న రమణ

జీడికి మద్దతు ధర ప్రకటించాలి

ప్రజాశక్తి- పోలాకి

జీడి పంటకి మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షులు వెలమల రమణ కోరారు. మండలంలోని మబగాం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిని ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీడి పంటక మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సహాయ కార్యదర్శి కొండయ్య, జి.రెయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నందిగాం : స్థానిక అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి, కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఆంగ్ల మధ్యమంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎన్.వాణి అన్నారు. మార్చి 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

బురదమయంగా ఉన్న తాగునీరు

చందనగిరిలో దాహం కేకలు

మెళియాపుట్టి: మండలంలోని ఎత్తైన కొండలపై నివసిస్తున్న చందనగిరి గిరిజనుల దాహం కేకలు అరణ్యరోధనగా మారుతున్నాయి. గ్రామంలో సుమారు 25 కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలోని యాలనాటి బావినీళ్లు అడుగంటడంతో కొండ వాగు వద్ద ఉన్న జక్కరి గుంట నీటిపై ఆధార పడుతున్నారు. పాలవలే తెల్లగా ఉండే కలుషిత నీరే విరికి శరణ్యం. దీంతో ఈ నీరే తాగుతుండడంతో అనారోగ్యానికి గురవుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజనుల అభివృద్ధికి కోట్లాది రూపాయల ఖర్చు చేస్తున్నామని చెబుతున్న పాలకులు ఇక్కడ గిరిజనులకు మౌలిక సౌకర్యాలు కానరాకుండా పోతున్నాయి. ప్రభుత్వం సమస్యలపై దృష్టి సారించి మెరుగైన తాగునీరు సౌకర్యం అందేలా చూడాలని గిరిజనులు కోరుతున్నారు.

డాన్స్ చేస్తున్న విద్యార్థులు

సందడే సందడి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక స్వర్ణభారతి జూనియర్ కళాశాలలో విద్యార్థులు ఆదివారం ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సినీ గేయాలకు చేసిన నత్యృత్యాలు అందరినీ అలరించాయి. విద్యాసంస్థ చైర్మన్ చాట్ల రాముిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకునిఉజ్వల భవిష్యత్‌కు బాటు వేసుకోవాలన్నారు. చదువు కేవలం మార్కుల కోసం కాకుండా, సమాజ మార్పు కోసం ఉపయోగపడే విధంగా ఉండాలన్నారు. ఎఎంసి మాజీ చైర్‌పర్సన్ చాట్ల సుజాతారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా మెలగాలన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కోరారు. అనంతరం వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జల్లు జయప్రకాష్, కె.సందీప్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను రెగ్యులర్ చేయాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని లేకుంటే ఆందోళన తప్పదని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఐజె నాయుడు కాలనీలో పారిశుధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులతో ఏళ్ల తరబడి ఊడిగం చేయించు కుంటూ వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేసి తలారి వ్యవస్థకు అప్పచెప్పాలని ప్రయత్నం చేస్తుందని ఇది కార్మికుల భద్రతకు ప్రమాదమని దీనిని ప్రతిఘటిస్తామన్నారు. విధుల్లో ఉంటూ చనిపోయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని, జాతీయ సెలవులను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారానికి కార్మికులందరూ దశలవారీగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్మికుల యూనియన్ నాయకుడు తాడి సంతోష్ కుమార్ మాట్లాడుతూ పట్టణ

సమావేశంలో మాట్లాడుతున్న బలరాం

జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచకపోవడంతో కార్మికులపై పని భారం పెరిగి ఒత్తిడి పెరుగుతుందన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు మున్సిపల్ అధికారులను కోరినప్పటికీ ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు ఎం.రాజేష్, కె.రాజు, కె.గోవింద, ఎన్. రమ, నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమ్మె చేస్తున్న రైస్‌మిల్లు కార్మికుల

13వ రోజుకు కార్మికుల సమ్మె

మందస: మండలంలోని సిద్ధూరు, మందస పరిధిలో 13 రోజులుగా రైస్ మిల్లు కార్మికుల సమ్మె కొనసాగుతుంది. ఛార్టర్ అఫ్ డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద, సిమ్మె శిబిరం వద్ద ధర్నాలు, ర్యాలీలు, మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్నారు. 2022లో జరిగిన వేతన ఒప్పందం గతేడాది జూన్ 30తో ముగిసింది. నూతన వేతన ఒప్పందం చేసుకునేందుకు చర్చలకు రావాలని జూన్ నెలలోనే యాజమాన్యాలకు డిమాండ్ నోటీసు ఇచ్చారు. ఎనిమిది నెలలుగా ఎదురు చూసి చివరిగా ఫిబ్రవరి 11 నుంచి సమ్మె చేస్తున్నారు. ఆదివారం ఈ సమ్మె శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి ఎన్.గణపతి, మండల కన్వీనర్ కె.కేశవరావు మాట్లాడారు. వేతన సవరణ వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా లేబర్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే రైస్‌మిల్లు యజమానులు నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తున్నారని విమర్శించారు. సమస్యలు పరిష్కరించకుంటే దశల వారీగా పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైస్‌మిల్లు వర్కర్స్ యూనియన్ నాయకులు టి.లక్ష్మీనారాయణ, కె.బాలకృష్ణ, బి.దుర్యోధన, పి.కుర్మారావు, ఆర్.ఏకాశి, బి.వెంకటేశం, బి.మల్లేశ్వరావు, జీడి కార్మిక సంఘం నాయకులు సిహెచ్.చంద్రావతి, గుసిరి బాలమ్మ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వామ్యులు కావాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఐక్యవేదిక ప్రతినిధులు పుట్టా సురేంద్రబాబు, డాక్టర్ వెన్నపూస బ్రహ్మారెడ్డి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక 2వ రాష్ట్రస్థాయి సమావేశం నగరంలోని కాళింగ సామాజిక భవనంలో రాష్ట్ర అధ్యక్షులు మంచాల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. తొలుత ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జెండా ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అమలకు ఎన్నికల అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మారుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో వస్తున్న మార్పులకు అనుగుణమైన పద్ధతుల్లో ఎన్నికలు నిర్వహించుకోలేకపోతే పాలనలో ప్రజల పాత్ర అంతకంతకు తగ్గిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అధికారం కేంద్రీకృతమైనప్పుడు అన్ని నిర్ణయాలు ఒకే దగ్గర జరుగుతాయని వివరించారు. స్థానిక సంస్థలకు వచ్చే నిధులు వాటితో చేపట్టాల్సిన విధులు నిర్ణయించుకునే అధికారం ఆయా సంస్థలకే

మాట్లాడుతున్న సురేంద్రబాబు

ఇవ్వాలని సూచించారు. అనంతరం గత అనుభవాల దృష్ట్యా లోపాలను సవరించుకుంటూ సంస్థ పురోగతికై వార్షిక కార్యాచరణను రూపొందించారు. కార్యక్రమంలో జైభారత్ వ్యవస్థాపకులు విజయ విహారం రమణమూర్తి, ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్ష కోశాధికారులు కె.వి.ఆర్.వి.ప్రసాద్, జె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు రహీం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉంగటి వెంకటరమణమూర్తి, కుమిలి రాజేష్, కోర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి జోక్యం తగదు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఇప్పటి వరకు ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలు తప్ప రాజకీయ పార్టీల జోక్యం ఉండేది కాదని, ఈసారి ఎన్నికల్లో ప్రత్యక్షంగా కూటమి పార్టీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులకు ప్రత్యక్షంగా సహకరిస్తూ ప్రచారం చేపట్టడం విడ్డూరంగా ఉందని ఎస్‌సి, ఎస్‌టి టీచర్స్ ఫెడరేషన్ పూర్వపు అధ్యక్షులు పోతల దుర్గారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన మందిర్‌లో సంఘ నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. స్కూళ్లలో ఉపాధ్యాయ, అధ్యాపకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, రెండుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన వారుగాని, గతసారి విజాయాన్ని అందుకున్న వారు విస్మరించారన్నారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించక పోవడం వల్ల ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు ఇబ్బందులు పడుతున్నారని, ఈ తరుణంలో ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నాయకులు ఒక

విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఫెడరేషన్ నాయకులు

అభ్యర్థి తరపున ప్రచారం చేయడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. పిఆర్‌సి, డిఎల పెండింగ్, పాత బకాయిలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టి ఫెడరేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆవల అప్పన్న, కింజరాపు నూకరాజు, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్షులు అంపోలు ప్రతాప్, ఎచ్చెర్ల మురళి, వై.ధనరాజ్ పాల్గొన్నారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో సంతృప్తి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పుట్టి పెరిగిన ఊరులో పని చేయడం వల్ల చేతనైనంత మేరకు నగర అభివృద్ధిలో భాగస్వామి కాగలిగాను. మున్సిపల్ కార్పొరేషన్‌లో రోడ్ల విస్తరణ ఉద్యోగ జీవితంలో ఎంతో సంతృప్తిని మిగిల్చింది. ఈనెలాఖరున ఉద్యోగ విరమణ చేస్తున్న సమయంలో నగర అభివృద్ధిలో తన భాగస్వామ్యాన్ని గుర్తు చేసుకున్నారు టౌన్ ప్లానింగ్ అధికారి యామల ఉమా మహేశ్వరరావు. తల్లి సావిత్రమ్మ, తండ్రి సూర్యారావు దంపతులకు నాలుగో సంతానం యామల ఉమామహేశ్వరరావు. శ్రీకాకుళం పట్టణం బలగవీధిలో 1963 ఫిబ్రవరి 27న జన్మించారు. స్థానికంగా ఉన్న ఎన్‌టిఆర్ మున్సిపల్ హైస్కూల్‌లోనే పదోతరగతి వరకు చదువుకుని ఆపై ఉన్నత విద్య చదువుకున్న ఆయన 1993లో ఆమదాలవలస మున్సిపాలిటీలో బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభించారు. 1998 వరకు ఆమదాలవలసలో పనిచేసి, 1998 నుంచి 2003 వరకు ఇచ్ఛాపురం మున్సిపాలిటీకి బదిలీపై వెళ్లారు. ఆతర్వాత 2003 నుంచి 2007 వరకు తూర్పుగోదావరి జిల్లా భీమ వరంలో పనిచేసిన ఆయనను 2007లో పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగోన్నతి కల్పించారు. 2009 వరకు అక్కడే పనిచేసి శ్రీకాకుళం నగరానికి వచ్చారు. 2009 నుంచి 2015 వరకు శ్రీకాకుళం మున్సిపాలిటీలో పని చేస్తుండగా 2015లో విజయనగరం మున్సిపాలిటీకి బదిలీ చేశారు. అక్కడ 2016 వరకు అక్కడ పనిచేసి 2016 నుంచి 2017 వరకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో తర్వాత 2017 నుంచి 2023 వరకు మరలా విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో పనిచేశారు. 2023 నుంచి ఇప్పటివరకు శ్రీకాకుళం టౌన్ ప్లానింగ్ అధికారిగా పని చేస్తున్న ఆయన ఫిబ్రవరి 28న ఉద్యోగ విరమణ చేస్తున్నారు.

సంతప్తిరించే అంశం

32 ఏళ్ల కాలంలో ఆమదాలవలసలో ఐడిఎస్‌ఎంటి రూ.2 కోట్లుతో షాపింగ్ కాంప్లెక్స్, అనుసంధాన రోడ్లు వేయడం సంతృప్తి నిచ్చిందన్నారు. అదే సమయంలో అసిస్టెంట్ ఎలక్షన్ అధికారిగా పనిచేశానన్నారు. ఇచ్ఛాపురం



మున్సిపాలిటీలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విస్తరణ పనులు బాగా చేయించడం వలన ఉన్నతాధికారుల వద్ద మంచి గుర్తింపు పొందాన న్నారు. తూర్పు గోదావరి జిల్లా భీమవరంలో వార్డులు డివిజన్ చేసి మున్సిపల్ ఎన్నికలు నిర్వహణలో పాల్గొన్నానన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్‌లో అప్పటి ఎమ్మెల్యే, కమిషనర్ సహకారంతో పొట్టి శ్రీరాములు రోడ్డు జంక్షన్ నుంచి కిన్నెర థియేటర్ వరకు, 80 అడుగుల గ్రీన్ బెల్ట్ రోడ్డు, చిన్న బజార్ రోడ్డు, రిమ్స్ రోడ్డు, జిటి రోడ్డు, కలెక్టర్ బంగ్లా రోడ్డు వైడింగ్ చేసి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడం ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ప్రస్తుతం పెద్దపాడు రోడ్డు ఆక్రమణలు తొలగించి పనులు ప్రారంభించగలిగామన్నారు.

అవార్డులు

శ్రీకాకుళం, పలాస, విశాఖపట్నంలో పనిచేసినప్పుడు వరుసగా నాలుగుసార్లు ఉత్తమ అధికారి అవార్డులు అందుకున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

బంజీరులో విషాదం

మార్కండేయులు (ఫైల్)

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో మర్రిపాడు-సి పంచాయతీ బంజీరుకు చెందిన గూడ మార్కండేయులు (34) ఆదివారం టెక్కలి మండలం అయోధ్యపురం వద్ద సంభవించిన ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుడు ఎఫ్‌సిఐ గోడంలో రోజు కూలీగా పనిచేస్తూ కుటుంబ పోషణ సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. భర్త మృతి చెందడంతో భార్య హేమలత తల్లిదండ్రులు, బంధువులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

శాంతారాం మాస్టర్ మృతి

శాంతారాం (ఫైల్)

పొందూరు: ప్రముఖ సామాజిక, సంఘ సంస్కర్త, యంగస్టార్స్ సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కాళ్లకూరి శాంతారాం (70) ఆదివారం మధ్యాహ్నం ఆకస్మికంగా మృతి చెందారు. మండల ప్రజలకు శాంతారాం మాష్టారు సుపరిచితులు. సంఘ సంస్కర్తగానే కాకుండా, ఉపాధ్యాయ సంఘ ప్రతినిధిగా, పొందూరు పైడితల్లి అమ్మవారి ట్రస్టు వ్యవస్థాపక సభ్యులుగా అమ్మవారి ఆలయానికి విశేషసేవలందించారు. రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యునిగా సేవాకార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి గుర్తింపు పొందారు. ప్రభుత్వం రాత్రిబడులు ప్రారంభించకముందే పొందూరులో భవననిర్మాణ కార్మికులకోసం, రిక్షాపుల్లర్ల కోసం రాత్రిబడులు నిర్వహణలో పాలుపంచుకుని ఎంతోమందిని అక్షరా స్యులుగా తీర్చిదిద్దడంలో కీలకపాత్ర వహించారు. చుట్టుప్రక్కల ప్రాంతాల్లో అగ్నిప్రమాదాల భాదితులకు, దేశంలో విపత్తులవలన నష్టపోయిన భాదితుల కోసం మండలంతో పాటు చుట్టుప్రక్కల ప్రాంతాల్లో విరాళాలు సేకరించి అందించి తన ఔదార్యాన్ని చాటుకుంటారు. ప్రభుత్వ ఉపాధ్యా యుడిగా సేవలందించారు. రంగస్థల కళాకారుడిగా విశిష్ట గుర్తింపు పొందారు. శాంతారాం మాష్టారు మృతిపై ఎమ్మెల్యే కూన రవికుమార్, టిడిపి మండల అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్, సర్పంచ్ ఆర్.లక్ష్మి, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, పలు పార్టీల నాయకులు తమ సంతాపాన్ని వ్యక్తం చేసారు. శాంతారాంకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ బాపన్నపేటకు చెందిన దుంపల వాసుదేవరావు ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. వాసుదేవరావు గతేడాది డిసెంబరు 18న సీమెన్ ఉద్యోగం కోసం ముంబాయి వెళ్లాడు. అయితే అక్కడ నుంచి మూడు రోజులు క్రితం అనారోగ్యంతో బాధపడుతూ కొన్ని మందులు తీసుకొని ఇంటికి చేరాడు. అందరితో కలిసి మెలిసి తిరుగుతూ ఆదివారం ఉదయం నరసన్న పేటలో ఒక రోగికి పరామర్శించి మధ్యాహ్నం ఇంటికి చేరుకొన్నారు. పొలానికి వినియోగించి మిగిలిన పురుగుల మందును తన తండ్రి అప్పన్న ఇంట్లో దాచి పెట్టాడు. ఇంటికి చేరిన వాసుదేవరావు ఆ మందును తాగాడు. తన తల్లి లక్ష్మి గమనించి పరుగున వెళ్లి మందు డబ్బాను చేతిలోంచి తీసుకొని హుటా హుటినా కోటబొమ్మాళి సామాజిక ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రథమచికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి రిఫర్ చేశారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రాలు పదిలం

వెంకట రమణమ్మ (ఫైల్)

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని న్యూకాలనీలో నివాసముంటున్న బరాటం వెంకట రమణమ్మ (84) ఆదివారం మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులు విమలకుమారి, రమాదేవి, ఉష తన తల్లి నేత్రాలను దానం చేశారు. రెడ్‌క్రాస్ సాంకేతిక సిబ్బందికి సమా చారం అందజేయడంతో వారు వచ్చి కార్నియా సేకరించి విశాకలోని ఎల్.వి.ప్రసాద్ కంటి ఆస్పత్రికి పంపించారు.

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ఇచ్ఛాపురం: గంజాయితో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకరుల ముందు నిందితులను ప్రవేశపెట్టారు. ఇచ్ఛాపురం రైల్వే స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరు వ్యక్తులను పట్టణ పోలీసులు తనిఖీలు చేశారని అన్నారు. వారి వద్ద నుంచి 31.110 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై, అమ్మకాలపై నిఘా పెట్టామని అన్నారు. ఇందులో భాగంగా అనుమానితులు ఉపేంద్ర స్వాన్, జ్ఞానేశ్వర్ శెట్టిలను తనిఖీ చేశామన్నారు. వారు ఒడిశా రాష్ట్రం నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో టౌన్ ఎస్ఐ ముకుందరావు, హెచ్‌సి రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధ్యాయునిపై కేసు నమోదు

నందిగాం: మండలంలోని దేవుపురం పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కొండాల గోపాలంపై ఫోక్సో, ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేశామని ఎస్ఐ షేక్ మహమ్మద్ ఆలీ ఆదివారం తెలిపారు. అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించాడని శనివారం డిఇఒ ఎస్.తిరుమల చైతన్యకు ఫిర్యాదు చేశారని అన్నారు. అనంతరం విద్యార్థిని తల్లి శనివారం రాత్రి ఫిర్యాదు చేసిందన్నారు. దీనిపై టెక్కలి డిఎస్‌పి డి.ఎస్.ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి, టెక్కలి రూరల్ సిఐ కె.శ్రీనివాసరావులు గ్రామంలో విచారణ చేపట్టారన్నారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు

ఇచ్ఛాపురం: గ్రామాల్లో నాటుసారా తయారీ చేసినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ పి.దుర్గాప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని సన్యాసపుట్టుకలో నాటుసారా నిరోధంపై ఆదివారం అవగాహన కల్పించారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా, గంజాయి అమ్మినా టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం అందజేసిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. మద్యం దుకాణాలదారులు అధిక ధరలకు అమ్మకాలు చేసిన సమాచారం ఇవ్వాలని తెలిపారు. బెల్ట్ షాపులపై కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సీనియర్ ఐఎఎస్ అధికారి సుబ్బారావు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర్ శర్మ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతించారు. స్వామివారి సేవల అనంతరం అనివేటి మండపంలో ఆలయ సూపరింటెండెంట్ ఎస్.కనకరాజు శేష వస్త్రాలను కప్పి చిత్రపటాన్ని అందజేశారు.

అరసవల్లి ఆదాయం రూ.11.96 లక్షలు

అరసవల్లి ఆలయానికి మాఘ ఆదివారం కావడంతో రద్దీ పెరిగింది. దీంతో ఒక్క రోజున రూ.11.96 లక్షల ఆదాయం సమకూరింది. టికెట్ల రూపంలో రూ.8,09,600, విరాళాల రూపంలో రూ.1,34,906, ప్రసాద విక్రయాల ద్వారా రూ.2,51,675 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఇఒ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు.

ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సూదికొండ దరి పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలో శనివారం రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో ఆక్రమణలు తొలగించారు. ఈ ప్రాంతంలో మొత్తం 60 ఎకరాలు డీపట్టా స్థలం ఉండగా, అందులో కేంద్రీయ విశ్వవిద్యాలయం నిర్మాణం నిమిత్తం సర్వే నంబరు 51లో 9,10 ఎకరాలు స్థలంలో ఉన్న ఆక్రమణలను తహశీల్దార్ టి.కళ్యాణచక్రవర్తి ఆధ్వర్యాన కాశీబుగ్గ సిఐ పి.సూర్యనారాయణ సహకారంతో ప్రొక్లెయినర్‌తో చదును చేశారు. పునాదులు, దిమ్మలతో పాటు, చెట్టు, పుట్టలను తొలిగించి స్థలం శుభ్రపరిచారు. విషయం తెలుసుకొన్న కొనుగోలుదారులు చేరుకుని అధికారులతో వివాదానికి దిగారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖగేష్, సర్వేయర్ గిరి పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కోటబొమ్మాళి: మండలంలోని చిన్నహరిశ్చంద్రపురం పంచ ధామ క్షేత్రంలో ఈ నెల 26 నుంచి నిర్వహించనున్న శివరాత్రి మహోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను కేంద్ర పౌర విమానయానశాఖ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదివారం నిమ్మాడలో ఆవిష్కరించారు. ఉత్సవాలు ఇంత ఘనంగా నిర్వహించినందుకు ఆలయ వ్యవస్థాపకుడు ఉప్పాడ కనకరాజుకు అభినందించారు. కార్యక్రమంలో కింజరాపు హరివరప్రసాద్, కింజరాపు ప్రభాకర్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, పూజారి శైలజ పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వివిధ స్వచ్ఛంద సంస్థలు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ అన్నారు. ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా మండలంలోని తిలారులో సిమ్మినాయుడు ఛారిటిబుల్ ట్రస్టు ఆధ్వర్యాన విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ నేత్రా ఆస్పత్రి ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నేత్ర వైద్యులు 200 మంది రోగులకు నేత్రాలను పరీక్షించారు. అందులో 35 మందికి నేత్ర ఆపరేషన్‌కు ఎంపిక చేశామని వైద్యులు మనీషా తెలిపారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తర్ర జనార్దన్, శంకర్ ఫౌండేషన్ సభ్యులు సురేష్, సిహెచ్.అశ్వనికుమార్, చాందిని పాల్గొన్నారు.

దళ్లవలసలో రాజమ్మతల్లి జాతర

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దళ్లవలసలో రాజులమ్మ జాతరకు ఆదివారం వేలాది మంది యాత్రికులు తరలివచ్చారు. ప్రతీ రెండేళ్లకోసారి ఈ జాతరను నిర్వహిస్తుంటారు. ఈ జాతరకు ఆంధ్ర, తెలంగాణతో పాటు ఒడిశా రాష్ట్రాల నుంచి వేలాది మంది యాత్రికులు తరలివచ్చి రాజులమ్మ తల్లికి మొక్కులు తీర్చుకుంటారు. రెండురోజుల పాటు జాతర నిర్వహిస్తారు. ఆది వారం చివరిరోజు కావడంతో దర్శనానికి యాత్రికులు పోటెత్తారు. యాత్రికులతో పాటు వందలాది వాహనాలు రావడంతో గ్రామంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. సిఐ పి.సత్యనా రాయణ, ఎస్ఐ వి.సత్యనారాయణ ట్రాఫిక్‌ను క్రమబద్దీకరించారు. ఎండ తీవ్రంగా ఉండడంతో కమిటీసభ్యులు యాత్రికుల కోసం తాగునీటి ఏర్పాట్లు చేశారు.

బొబ్బిలిపేటలో ముళ్లపొదల తొలగింపు

ఆమదాలవలస: మండలంలోని బొబ్బిలిపేటకు వెళ్లే రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టినట్లు సర్పంచ్ గొండు వెంకటరమణ తెలిపారు. ఆదివారం పాలకొండ ప్రధాన రహదారి నుంచి బొబ్బిలిపేట వరకు సుమారు మూడు కిలోమీటర్లు మేర రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను జెసిబితో తొలగించినట్లు సర్పంచ్ తెలిపారు. పంచాయతీ రాజ్ అధికారులకు పలుమార్లు జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరామని తమ శాఖకు ఆ సౌలభ్యం లేదని పంచాయతీ నిధుల నుంచి కార్యక్రమం చేపట్టాలని వారు సూచించడంతో పనులు చేపట్టామని తెలిపారు. దట్టంగా పెరిగిన ముళ్ల పొదలతో చీకటి పడితే ప్రయాణం చేయాలంటే వాహనదారులు, ప్రజలు బయపడే వాళ్లమని

జంగిల్ క్లియరెన్స్ పనులు పర్యవేక్షిస్తున్న సర్పంచ్

జంగిల్ క్లియరెన్స్‌తో ఆ సమస్య పరిష్కారమైందన్నారు. ఇటీవల ఇదే రహదారిపై ఓ హత్య కూడా జరిగిందని, రహదారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు తొలగింపుతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారని వార్డు మెంబర్ చింతాడ అప్పారావు తెలిపారు.

మాట్లాడుతున్న భరద్వాజ్

ఆపదలో ఉన్న వారిని ఆదరించాలి

ప్రజాశక్తి- రణస్థలం

ఆపదలో ఉన్న వారికి సహాయ సహకారాన్ని అందించి ఆదరించాలని లాస ఫౌండేషన్ వ్యవస్థాపకులు భరద్వాజ్ అన్నారు. రణస్థలం హెల్పింగ్ హాండ్స్ సభ్యులు విజ్ఞప్తి మేరకు రణస్థలం వచ్చిన భరద్వాజ్ లాస ఫౌండేషన్ ఎలా పనిచేస్తుంది, సమాజంలో ప్రజలు మీద ప్రేమ అభిమానం ఎలా పెంచుకోవాలి, ఆపదలో ఉన్న వారికి సహాయపడే గుణం ఎలా అలవర్చుకోవాలో తెలియజేశారు. గ్రామంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మహదాను మోహనరావుకి ప్రతినెల మందుల ఖర్చులకు రూ.5 వేలు లాస ఫౌండేషన్ తరపున వారికి ఇస్తామన్నారు. అలాగే గొర్లె కన్నం నాయుడు కంటి ఆపరేషన్‌కి అవసరమైన వైద్య సహాయం అందిస్తామని తెలిపారు. లాస ఫౌండేషన్‌లో వాలంటీర్‌గా మీరు చేరి కొంతమందిని చేర్పించాలని, సమిష్టిగా అందరం కలిసి పనిచేస్తే ఎక్కువ మందికి సహాయం చేయవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో లాస ఫౌండేషన్ ప్రతినిధులు, సభ్యులు, రణస్థలం హెల్పింగ్ హాండ్స్ ప్రతినిధులు, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రతి విద్యార్థి చదువుకునే సమయంలో ఒత్తిడికి గురి కాకుండా మనో నిబ్బరాన్ని కలిగి ఉండాలని, అప్పుడే లక్ష్యాలను అధిగ మించగలరని సిగ్మా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ ఉలిమిరి వెంకట సోమయాజులు అన్నారు. నగరంలోని పాత శ్రీకాకుళం హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో విద్యార్థులకు మానసిక ఉల్లాసంపై అవగాహన కల్పించారు. సాధన వల్ల సాధ్యం కానిది ఉండదని, అందువల్ల కృషి, పట్టుదలతో లక్ష్యాలను సాధించు కోవాలన్నారు. శారీరక, మానసిక ఉల్లాసం కలిగి ఉండాలని ఆయన సూచించారు. చిన్నతనం నుంచి సాధన

మాట్లాడుతున్న సోమయాజులు

అలవాటు చేసుకుంటే మంచి ఫలితాలు సాధించగలరన్నారు. కార్యక్రమంలో ఆక్స్‌ఫర్డ్ స్కూల్ యాజమాన్య ప్రతినిధులు అన్నెపు రమేష్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఏకోపాధ్యాయ స్కూళ్లతో విద్యా ప్రమాణాలకు అడ్డంకి

మాట్లాడుతున్న రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఏకోపాధ్యాయ పాఠశాలలతో విద్యార్థులకు సమగ్ర విద్యాబోధన సాధ్యం కాదని, దీనివల్ల విద్యా ప్రమాణాలు క్షీణించే ప్రమాదముందని ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబిల్లి రమణ అభిప్రాయపడ్డారు. నగరంలోని క్రాంతి భవన్‌లో ఎస్‌టియు ఆధ్వర్యాన ఏకోపాధ్యాయ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యలపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 12611 పాఠశాలలు ఏకోపాధ్యాయులతో నడుస్తున్నాయని, జిఒ 117 సవరణ వల్ల వాటికి అదనంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టే పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రతి ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు వంతున ఉపాధ్యాయులను నియమించాల్సి ఉన్నా ప్రభుత్వం ఆదిశగా ఆలోచన చేయడం లేదన్నారు. బోధనతో పాటు 45 రకాల యాప్‌లలో డేటా నమోదు వలన బోధనకు అడ్డంకిగా మారుతోందన్నారు. చర్చా కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.శ్రీనివాసరావు, జి.శ్రీనివాసరావు, సిహెచ్ జగన్, కె.వి.రమణ, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పట్టా ఉంటే వేరొక చోట స్థలం ఇస్తాం

బాధితులకు వెంకటన్న చౌదరి హామీ

ప్రజాశక్తి- పలాస

ఆక్రమణలు తొలగింపులలో పట్టాలు ఉండి నష్టపోయిన బాధితులకు మహిళల పేరుతో వేరొక చోట స్థలాలు కేటాయిస్తానని టిడిపి నియోజకవర్గం సమన్వయకర్త వెంకన్న చౌదరి హామీ ఇచ్చారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబరు 51లో ఆదివారం రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించారు. దీంతో కొంతమంది బాధితులు తమకు పట్టాలు ఉన్నా తమ స్థలం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారని అధికారుల వద్ద ఆరోపించారు. అనంతరం సూది కొండవాసులు వెంకన్న చౌదరిని కలిశారు. ఆ ప్రాంతంలో తమకు ఎన్నో ఏళ్లుగా పట్టాలు కలిగి

బాధితులతో మాట్లాడుతున్న వెంకటన్న చౌదరి

ఉన్నామని, రెవెన్యూ అధికారులు మా స్థలాలను తొలగించడంతో తమకు న్యాయం జరగిందని వాపోయారు. దీనిపై స్పందించిన ఆయన తప్పనిసరిగా న్యాయం చేస్తామని హామీనిచ్చారు.

శ్రీశైలం మల్లన్న తలపాగా తిరు మహోత్సవం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శ్రీశైలంలో ఉన్న భ్రమరాంబిక, మల్లిఖార్జున స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకల్లో భాగంగా ఏటా జిల్లా నుంచి చేనేత కార్మికులు తలపాగాను సిద్ధం చేయడం ఆనవాయితీ. అందులో భాగంగా ఈఏడాది బ్రహ్మోత్సవాల్లో అలంకరించేందుకు సిద్ధం చేసిన తలపాగా తిరువీధి మహోత్సవాన్ని ఆదివారం నగరంలోని పాజుల్‌బాగ్‌పేటలో నిర్వహించారు. ఈ వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి స్వాతి హాజరై చేనేత కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ తిరువీధి మహోత్సవం అనంతరం ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు గోవింద్ రెడ్డి, రాహుల్ గాంధీ, పంతులు శ్రీను, పల్లా కుమార్, రవితేజ, పంతులు రవి పాల్గొన్నారు.

అంబేద్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో గల అంబేద్కర్ జంక్షన్‌లో బాబాసాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం స్థానంలో కాంస్య విగ్రహాన్ని అమర్చాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును దళిత సంఘాల జెఎసి నేతలు త్రైకాండ్ శ్రీను, డా.కంఠ వేణులు కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అంబేద్కర్ జంక్షన్‌ను అభివృద్ధి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే ఎమ్మెల్యే శంకర్, నగరపాలక సంస్థ కమిషనర్ పివివిడి ప్రసాదరావులను కలిసి వినతులు అందజేశారు.

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- లావేరు

అప్పాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, తెలుగు యువత మండల అధ్యక్షుడు గంట్యాడ మహేష్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం అప్పాపురంలో పరామర్శించారు. మహేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆయనతో పాటు అదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ రెడ్డి శంకర్రను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, బిజెపి అధ్యక్షుడు లుకలాపు అప్పలనాయుడు, లంకలపల్లి శ్రీనువాసరావు, బాసిన డాలిరాజు, సత్తిబాబు, రమణ, అప్పలనాయుడు, బాబూరావు తదితరులున్నారు.

చీరల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని లొద్దలపేటలోని శ్రీసీతారామ ఆలయ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శోభాయాత్ర చీరలను కమిటీ సభ్యులు ఆదివారం ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీతారామ ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 28 నుంచి మార్చి 2 వరకు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలు విజయవంతం చేయాలని కోరారు.

కుళాయిలో బురద నీరు

కొత్తూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలకు తాగునీరు కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు బురద రావడంతో ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు.



మండలంలోని వసప వద్ద ఉన్న తాగునీరు మెగా వాటర్ స్కీం ద్వారా వంశధార నదీ తీరం ఉన్న 16 గ్రామాలకు నీరు సరఫరా అవుతుంది. కుళాయి నీరు అన్ని గ్రామాలకూ ఆధారం. ప్రస్తుతం కలుషిత నీరు వస్తుండం, వాటినే తాగడంతో రోగాలు మారినబడే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి సూరిబాబుకు వివరణ కోరగా, సాంకేతిక కారణాల వల్ల బురద నీరు వస్తుందని, ఈ విషయం ఉన్నతాధికారులు అధికారులు చూసుకుంటారని, నాకు సంబంధం లేదని చెప్పారు. తాగునీరు కుళాయి ద్వారా సరఫరా అవుతున్న బురద నీటి సమస్యను ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.